సిద్దిపేట జిల్లా మద్దూరు రోడ్‌షోలో విజయ సంకేతం చూపిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి

శనివారం సిద్దిపేట జిల్లా మద్దూరులో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు నిర్వహించిన రోడ్‌షోకు భారీగా హాజరైన ప్రజలు

రిస్క్ వద్దు.. కారుకే గుద్దు

- కాంగ్రెస్‌కు ఓటేస్తే తెలంగాణ పదేండ్లు వెనక్కిపోతుంది
- కరెంటు ఉండదు.. రైతుబంధు రాదు.. పల్లెల్లో కరువు వస్తది
- 3 గంటల కరెంటిచ్చుడు మార్పా?
- ఆ పార్టీని నమ్మి నిండా మోసపోయిన కర్ణాటక ప్రజలు
- కేసీఆర్‌కు రాష్ట్ర ప్రజలే హైకమాండ్
- 80 సీట్లతో బీఆర్ఎస్‌దే అధికారం
- డిసెంబర్ 3 తర్వాత గిరిజనబంధు
- మంగళవారం అకౌంట్లో రైతుబంధు
- పాలకుర్తి, మహబూబాబాద్, జనగామ, ఆలేరు, భువనగిరి, నర్సంపేట నియోజకవర్గాల్లోని రోడ్‌షోల్లో మంత్రి హరీశ్‌రావు

(నమస్తే తెలంగాణ న్యూస్ నెట్‌వర్క్)

పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేస్తే తెలంగాణ అభివృద్ధి మళ్లీ పదేండ్లు వెనక్కిపోతుందని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అన్నారు. కరెంటు ఉండదు, రైతుబంధు రాదు, పల్లెల్లో కరువు తాండవిస్తుంది అని చెప్పారు. ప్రజలంతా జాగ్రత్తగా ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. శనివారం బీఆర్ఎస్ అభ్యర్థులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, బానోత్ శంకర్‌నాయక్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి తరపున పాలకుర్తి, మహబూబాబాద్, జనగామ నియోజకవర్గంలోని మద్దూరు, బచ్చన్నపేట, యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం, భువనగిరి, వరంగల్ జిల్లా నెక్కొండ రోడ్‌షోల్లో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. 'కాంగ్రెస్‌ను చూసి జాలిపడి, కరిగిపోయి ఆ పార్టీకి ఓటేయొద్దు. రిస్క్ వద్దే వద్దు. కారుకే ఓటు గుద్దు' అని ప్రజలకు హితవు చెప్పారు. నాటి, నేటి పరిస్థితులను బేరీజు వేసుకోవాలని, కండ్ల ముందున్న అభివృద్ధిని చూసి సీఎం కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇతర రాష్ట్రాల వాళ్లకు ఉపాధి కల్పించే స్థాయికి చేరామని గుర్తుచేశారు.

> 24 గంటల కరెంటిచ్చే బీఆర్ఎస్ కావాలా? 3 గంటల కాంగ్రెస్ కావాలా?

> ఈ గడ్డ మీద పుట్టిన బీఆర్ఎస్ కావాల్నా? ఢిల్లీలో పుట్టిన జాతీయ పార్టీలు కావాల్నా? కేసీఆర్‌ను శాసించేది, బీఆర్ఎస్ పార్టీని నడిపేది తెలంగాణ ప్రజలే
> - మంత్రి హరీశ్‌రావు

> కాంగ్రెసోళ్లు కర్ణాటకలో ఐదు గ్యారెంటీలు అని చెప్పి ఉన్న గోసి ఊడపీకిర్రు. వాళ్లను నమ్మితే మోసపోతం, పాపమంటే గోస పడ్తం. కరెంట్ కావాలా? కాంగ్రెస్ కావాల్నా?
> - మంత్రి హరీశ్‌రావు

ప్రియాంకగాంధీ చెల్లని రూపాయి

చెల్లని రూపాయి వంటి ప్రియాంక గాంధీ తెలంగాణకు వచ్చి ఎన్నికల ప్రచారం చేస్తున్నారని మంత్రి హరీశ్ విమర్శించారు. తన సొంత రాష్ట్రం ఉత్తరప్రదేశ్‌లో ఆమె 403 సీట్లలో ప్రచారం చేస్తే 3 సీట్లే కాంగ్రెస్ గెలిచిందని ఎద్దేవా చేశారు అక్కడ ప్రజలు పనికిరావని ప్రియాంకను ఛీదరించుకుంటే, ఇక్కడకు వచ్చి తెలంగాణ ప్రజల చెవిలో పూలు పెడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీ ఝూటా మాటలు నమ్మవద్దని, ఆ పార్టీలకు ఢిల్లీ హైకమాండ్ అయితే కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలే హైకమాండ్ అని స్పష్టం చేశారు. 'కాంగ్రెస్‌లో ఓడినోడు నేనే సీఎం అంటడు. గెలిచినోడు నేనే సీఎం అంటడు. ఇలాంటి కాంగ్రెస్ చేతికి రాష్ట్రాన్ని అప్పగించి రిస్క్ తీసుకుందామా?' అని ప్రజలను అడిగారు.

> రైతులు బిచ్చగాళ్లు అన్న రేవంత్‌రెడ్డికి గుణపాఠం చెప్పాలి

కర్ణాటక ప్రజలు ఆగమైతుండ్రు

కర్ణాటకలో కాంగ్రెస్‌ను నమ్మి గెలిపిస్తే ఇప్పుడు అక్కడి ప్రజలు ఆగమైతండ్రని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. ఇప్పుడు సమస్య వచ్చి ఎవరిని అడగాలో తెలియక పరేషాన్ అవుతున్నారని అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ బండారాన్ని అక్కడి రైతులే స్వయంగా తెలంగాణకు వచ్చి బయట పెడుతున్నారని తెలిపారు. కర్ణాటకలో మోసం చేసి అధికారంలోకి వచ్చినట్టే తెలంగాణలోనూ బూటకపు మాటలు చెప్తున్న కాంగ్రెస్ నమ్మి ఓటేస్తే ఆగం అవుతామని

> చిన్న పిల్లలాంటి తెలంగాణ కేసీఆర్ చేతిలో ఉంటేనే సురక్షితం

హెచ్చరించారు. రేవంత్‌రెడ్డికి ఏ విషయం మీదా పూర్తి అవగాహన ఉండదని విమర్శించారు. కుట్రలు, కుతంత్రాలు, మోసాలకు కేరాఫ్ అడ్రస్ లాంటి కాంగ్రెస్.. సోషల్ మీడియాలో బోగస్ ప్రచారం చేస్తూ అధికారంలోకి వచ్చేందుకు అడ్డదార్లు తొక్కుతున్నదని ఆరోపించారు.

లంబాడీల కల నెరవేర్చాం

గతంలో తండాలను గ్రామపంచాయతీలు చేస్తమని చెప్పి కాంగ్రెస్ మోసం చేసిందని, దీనిపై ఎల్‌హెచ్‌పీఎస్ వాళ్లు ఏండ్ల తరబడి

> కాంగ్రెస్ అంటే మోసం.. బీఆర్ఎస్ అంటే నమ్మకం

కొట్లాడితే పట్టించుకోలేదని హరీశ్‌రావు తెలిపారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చాక వారి డిమాండ్‌ను అమలుచేసి లంబాడీల కలను నెరవేర్చారని వెల్లడించారు. బీఆర్ఎస్‌కు ఓటేసి మూడోసారి కేసీఆర్‌ను సీఎంను చేస్తే ఈసారి గిరిజన బంధు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. 'మానుకోట మట్టికి దండం. మానుకోట రాళ్లకు దండం. మానుకోట యువతకు దండం. మానుకోట దెబ్బతో సమైక్యవాదులు వెనక్కి పరిగెత్తారు. మళ్లీ సమైక్యవాదులు ఒక్కటై తెలంగాణ మీద దండెత్తడానికి వస్తుండ్రు. వారికి మన మానుకోట దమ్మేంటో చూపించాలి' అని మహబూబాబాద్‌లో అన్నారు. లంబాడీలకు అత్యధిక సీట్లు ఇచ్చింది కేసీఆరేనని, ఎస్సీ, ఎస్టీలకు పది శాతం రిజర్వేషన్ ఇచ్చారని గుర్తుచేశారు.

> కాంగ్రెస్ నేతలు 3 గంటల కరెంట్ చాలంటున్నరు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని రేవంత్ ఉచిత సలహాలు ఇస్తున్నరు. ఆయన తుపాకీ రాముడు, పాగల్
> - మంత్రి హరీశ్‌రావు

బీఆర్ఎస్‌కు 80 సీట్లు పక్కా

అన్ని సర్వే ఫలితాలు బీఆర్ఎస్‌వైపు ఉన్నాయని, 80 సీట్లతో మరోసారి అధికారంలోకి రాబోతుందని హరీశ్‌రావు తెలిపారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయని, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అయ్యాక మిగతా పనులు కూడా పూర్తి చేస్తామని వెల్లడించారు. కాగా, మంగళవారం నుంచి రైతుల ఖాతాల్లో డబ్బులు పడతాయని తెలిపారు. వాళ్ల ఫోన్లకు టింగ్ టింగ్ మని మెసేజ్‌లు వస్తాయని అన్నారు. పింఛన్లు, కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా తదితర పథకాలతో రాష్ట్రాన్ని సుభిక్షంగా మార్చిన బీఆర్ఎస్‌కే ఓటు వేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మూడోసారి అధికారం చేపట్టాక కేసీఆర్ భరోసా పథకాలను అమలు చేస్తామని వెల్లడించారు. కేసీఆర్ మంచి పాడిబర్రె లెక్క ఉన్నారని, తెలంగాణలో అందరం బాగుపడుతున్నామని వ్యాఖ్యానించారు. కార్యక్రమాల్లో మంత్రి సత్యవతిరాథోడ్, ఎంపీ మాలోత్ కవిత, ఆర్టీసీ చైర్మన్ ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్సీ బొడకుంటి వెంటకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, జడ్పీ చైర్మన్లు ఎలిమినేటి సందీప్‌రెడ్డి, పాగాల సంపత్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, ఎంపీపీ జాటోత్ రమేశ్ నాయక్, జడ్పీటీసీ లావుడ్య సరోజ హరికిషన్, సొసైటీ చైర్మన్లు మారం రాము, జలగం సంపత్‌రావు, బీఆర్ఎస్ నేతలు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, కల్లూరి రామచంద్రారెడ్డి, సంగని సూరయ్య, కొమ్ము రమేశ్‌యాదవ్, పీపీ షేక్ అబ్దుల్‌నబీ, తాటిపెల్లి శివకుమార్, చల్లా చెన్నకేశవరెడ్డి, గుంటుక సోమయ్య, సూరం రాజిరెడ్డి, మాదాసురవి, సర్పంచ్ వడ్డేపల్లి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ అంటేనే నమ్మకం

'చావునోట్ల తలపెట్టి..కేంద్రం మెడలు వచ్చి తెలంగాణ రాష్ట్రం తెచ్చిన కేసీఆర్‌కు, ఉద్యమకారులపై తుపాకీ ఎక్కుపెట్టిన రేవంత్‌రెడ్డికి ఎక్కడైనా పోలిక ఉన్నదా? ఇద్దరి మధ్య నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉన్నది' అని మంత్రి హరీశ్ అన్నారు. తెలంగాణ అభివృద్ధి ధ్యాస తప్ప మరోటి లేని కేసీఆర్ మాటంటే ప్రజలకు నమ్మకం, ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాలపై విశ్వాసం, వచ్చే ఐదేండ్లలో అమలు చేయబోయే ఎన్నికల మ్యానిఫెస్టో పథకాలపై భరోసా ఉన్నదని చెప్పారు. 'బీఆర్ఎస్ సభలకు జనమే జనం.. కాంగ్రెస్, బీజేపీ సభలు వెలవెలపోతున్నాయి. ఖాళీ కుర్చీలు పెట్టుకుని ఉపన్యాసాలు ఇవ్వడం కాంగ్రెస్‌కు అలవాటు. కానీ,

> ఛత్తీస్‌గఢ్ నుంచి మొగోళ్లు వచ్చి గుత్తకు మాట్లాడి వరి నాట్లు వేస్తున్నరు. భవిష్యత్తు గురించి రాసిన బ్రహ్మం గారు కూడా మొగోళ్లు నాట్లేస్తరని ఊహించలేదు. కాలాన్ని మన కేసీఆర్ ఎంతగా తిరగ రాసిండో ప్రజలు గమనించాలి.
> - మంత్రి హరీశ్‌రావు

బీఆర్ఎస్ మీటింగుల్లో చోటు దొరకని పరిస్థితి. బీఆర్ఎస్ పార్టీకి ఇసుక వేస్తే రాలనంత జనం తరలివస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీల జాతీయ నాయకుల సభలకు జనం లేక ఖాళీ కుర్చీలకు తమ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారు' అని హరీశ్ ఎద్దేవా చేశారు.

కందుకూరులో ప్రసంగిస్తున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

మోదీ ఏ ముఖం పెట్టుకుని వచ్చావ్?

- పైసా ఇవ్వకుండా ఓటు అడిగే హక్కు మీకెక్కడిది?
- కందుకూరు రోడ్ షోలో మంత్రి సబితాఇంద్రారెడ్డి

రంగారెడ్డి, నవంబర్ 25(నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి రూపాయి ఇవ్వని ప్రధాని మోదీ ఏ ముఖం పెట్టుకుని తెలంగాణకు వచ్చి ఓట్లు అడుగుతున్నారని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గ కేంద్రం కందుకూరులో నిర్వహించిన రోడ్ షోలో ఆమె మాట్లాడారు. మొదటి నుంచీ మోదీ తెలంగాణ అంటేనే విషం కక్కుతారని, తెలంగాణకు వచ్చిన ప్రతి సారి సీఎం కేసీఆర్, కేటీఆర్, కవితలను తిట్టడం తప్పితే రాష్ట్రానికి ఏం చేశాం? ఏం చేస్తాం? అని ఏనాడైనా ప్రజలకు చెప్పారా? అని నిలదీశారు. దేశమంతా మెడికల్ కాలేజీలు ఇచ్చి తెలంగాణకు మొండి చెయ్యి చూపారని మండిపడ్డారు. ఈ ప్రాంతంలో ఐటీ ఐఆర్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తే.. ఐదు లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభించేవని, మోదీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఐటీఐఆర్ ప్రాజెక్టును రద్దు చేసి యువతకు ఉద్యోగాలు లేకుండా చేశారని విమర్శించారు.

గుండాలలో యాదవుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ బడుగుల. చిత్రంలో ఆలేరు అభ్యర్థి గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

యాదవుల ఆత్మబంధు సీఎం కేసీఆర్

- యాదవుల ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ బడుగుల

గుండాల, నవంబర్ 25 : సీఎం కేసీఆర్ యాదవుల ఆత్మ బంధువు అని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ కొనియాడారు.తెలంగాణలో 7.50 లక్షల యాదవ కుటుంబాలకు గొర్రెల యూనిట్లను అందజేశారని, దాంతో దేశంలోనే మాంసం ఉత్పత్తిలో తెలంగాణ ముందు వరుసలో ఉన్నదని అన్నారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో నిర్వహించిన యాదవుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారని చెప్పారు. రేవంత్‌రెడ్డి ఓ దొంగ అని, ఓటుకు నోటుకు కేసులో అడ్డంగా దొరికి చిప్పకూడు తిన్నాడని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీకి దిక్కులేక రేవంత్‌రెడ్డిని పీసీసీ అధ్యక్షుడిగా చేసిందని అన్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఓ మూర్ఖుడని, రైతుబంధు వద్దంటున్నాడని మండిపడ్డారు. యాదవులు కష్టజీవులని, యాదవులను గతంలో ఎవరూ పట్టించుకోలేదని అన్నారు. తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ యాదవులకు తగిన ప్రాధాన్యత కల్పించారని తెలిపారు. కారు గుర్తుకు ఓటేసి ఆలేరు బీఆర్ఎస్ అభ్యర్థి గొంగిడి సునీతామహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

ఖర్చంతా మాదే.. ప్లీజ్ వచ్చి ఓటేయండి

- ఓట్ల కోసం ప్రాధేయపడుతున్న అభ్యర్థులు
- ఇతర ప్రాంతాల్లోని ఉన్నవారికి ప్రత్యేక బస్సులు
- హైదరాబాద్ శివారు కాలనీల్లో ఆత్మీయ సమ్మేళనాలు

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎన్నికల తేదీ దగ్గరపడుతున్న కొద్దీ ప్రధాన పార్టీల హడావుడి పెరిగిపోతున్నది. ఈసారి ఒక్క ఓటు కూడా మిస్ కాకూడదని అన్ని పార్టీల నేతలు తెగ తంటాలు పడుతున్నారు. తమ నియోజకవర్గాల్లో ఓటు హక్కు కలిగి ఉండి జీవనోపాధి కోసమో లేక వేరే అవసరాల కోసమో ప్రాంతాలకు వెళ్లిన వారిని వెనక్కి రప్పించేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. వారికి ఫోన్లు చేసి తమకు ఓటు వేసేందుకు రావాలని పిలుస్తున్నారు. అందుకయ్యే ఖర్చులన్నీ తామే భరిస్తామని ప్రాధేయపడుతున్నారు. పలు నియోజకవర్గాల అభ్యర్థులు ఏకంగా వాహనాలను పెట్టి చెన్నై, ముంబై, షోలాపూర్ లాంటి దూరప్రాంతాలకు వలస వెళ్లినవారిని రప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. మరికొందరు అభ్యర్థులు ఈ పనిని తమ అనుచరులకు అప్పగించి ఓట్ల కోసం ఫాలోఅప్ చేస్తున్నారు. దీంతో ఎవరికి ఓకే చెప్పాలో తెలియక ఆయా ఓటర్లు సతమతమవుతున్నారు. మరోవైపు నల్లగొండ, మహబూబ్‌నగర్, వరంగల్, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం తదితర జిల్లాల్లోని నియోజకవర్గాల అభ్యర్థులు ఓట్ల కోసం హైదరాబాద్‌లోని కాలనీల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. ఆయా జిల్లాకు చెందిన ఎంతో మంది ప్రజలు హైదరాబాద్‌తోపాటు నగర శివారు కాలనీల్లో స్థిరపడటంతో వారి ఓట్ల కోసం పలువురు అభ్యర్థులు ఇప్పటికే ప్రత్యేక బస్సులను బుక్ చేసినట్లు సమాచారం.

చేసింది చెప్తూ.. ప్రజలను మెప్పిస్తూ!

- ఆలోచింపజేసేలా హరీశ్‌ప్రసంగాలు
- ప్రతి సభలో జనంతో మమేకం
- చేసిన మంచిని వారితోనే చెప్పిస్తూ వినూత్నంగా దూసుకెళ్తున్న మంత్రి

*జనగామ, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): చౌరస్తా.. లేకపోతే బహిరంగసభ.. లేకపోతే రోడ్‌షో.. లేకపోతే కార్నర్ మీటింగ్.. వేదిక ఏదైనా సరే. ఆ ఆరున్నర అడుగుల మనిషి.. నెమ్మదిగా ప్రసంగం మొదలుపెడతారు. ఆ ప్రసంగంలో ఛలోక్తులుంటాయి, సూటి విమర్శలు ఉంటాయి. అంతా ముచ్చట చెప్పినట్టే ఉంటుంది. జనం కూడా అదే తరహాలో మమేకం అవుతారు. అక్కడికి వచ్చినవాళ్లంతా ఆయన తనతోనే మాట్లాడుతున్నారన్నట్టు అనుభూతి చెందుతారు. అంతటి నేర్పరి బీఆర్ఎస్ స్టార్ క్యాంపెయినర్, ఆర్థిక మంత్రి హరీశ్‌రావు. తెలంగాణ ఉద్యమం గురించి, రాష్ట్ర అభివృద్ధి గురించి, దేశానికి దిక్సూచిగా ఉన్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తుంటే ప్రజలు చెవులు రిక్కించి వింటారు. అందరూ ఆయన ప్రసంగంతో కలిసిపోతారు. తెలంగాణకు ఎవరి నాయకత్వం అవసరం అని జనాన్ని అడుగుతారు. తెలంగాణ తెచ్చిన కేసీఆరా? తెలంగాణ వాళ్లను సంపిన కాంగ్రెస్సా? 24 గంటల కరెంటు ఇచ్చే కేసీఆర్ కావాలా? మూడు గంటల కరెంటు ఇచ్చే కాంగ్రెస్ అవసరమా? కేంద్రం మెడ మీద కత్తి పెట్టినా మోటర్లకు మీటర్లు పెట్టని బీఆర్ఎస్ సర్కారా? రైతులతో 10 హెచ్‌పీ మోటర్లు కొనిపించాలనే హస్తం పార్టీనా? రైతుకు బంధువుగా ఉండే కేసీఆర్ సర్కారా? అని ప్రశ్నిస్తూ అందరినీ ఆలోచింపజేస్తారు. వారి నుంచే సమాధానాన్ని రాబడతారు. ప్రజలు కూడా తాము చూసింది, అనుభవించింది, లబ్ధి పొందుతున్నది చేతులెత్తి మరీ జవాబు చెప్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు సభలు, రోడ్‌షోలు, సమ్మేళనాలతో తీరిక లేకుండా హరీశ్‌రావు ప్రచారం సాగుతున్నది. అయినా ప్రజలను ఆకట్టుకునేలా మాట్లాడుతారు. ముఖ్యంగా బీఆర్ఎస్ సర్కారు సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని వారితోనే చెప్పించటం హరీశ్‌రావు ప్రత్యేకత. కాంగ్రెస్, బీజేపీ అగ్రనేతలు మాట్లాడిన మాటలను గుర్తుచేస్తూ, ప్రజలముందే వారిని ఎండగడుతూ దూసుకుపోతున్నారు. శనివారం హరీశ్‌రావు పాల్గొన్న అన్ని సభలు కూడా ఇలాగే ఆసక్తికరంగా సాగాయి. రోజంతా బిజీగా గడిపినా ఎక్కడా అలసినట్టు కనిపించలేదు. మహబూబాబాద్, నర్సంపేట, పాలకుర్తి, జనగామ నియోజకవర్గాల్లో రోడ్‌షోలతో సుడిగాలి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ సర్కారు సుపరిపాలనను, కాంగ్రెస్ పాలించిన పాత రోజులను గుర్తుచేసి ప్రజలతోనే చెప్పించారు. బీజేపీ సర్కారు తెలంగాణకు చేస్తున్న అన్యాయాన్ని వివరించారు. రానున్న ఐదేండ్ల కార్యాచరణను వివరిస్తూ, ప్రతిపక్ష పార్టీలపై విమర్శనాస్త్రాలు సంధిస్తూ సూటిగా ప్రసంగం సాగింది. మూడోసారి కేసీఆర్ సీఎం అయ్యాక చేయబోయే పనులను చెప్పి ప్రజలకు భరోసా కల్పించారు.

పోడుభూములకు పట్టాలిచ్చి రాజులను చేశాం

- గుట్టలపై భూములకు సాగునీరు అందిస్తాం: మంత్రి వేముల

భీమ్‌గల్/వేల్పూర్, నవంబర్ 25 : అసైన్డ్, పోడు భూములకు పట్టాలిప్పించి భూమి హక్కులు కల్పించామని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి, బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్, వేల్పూర్ మండలాల్లో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. పోడు, అసైన్డ్ భూములకు పట్టాలు లేక రైతుబంధు ఇతర ప్రయోజనాలు అందక బాధపడేవారని, ఇప్పుడు ఆ సమస్య లేకుండా చేశామని అన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో మోతె గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, ఏమాత్రం లోటైనా కేసీఆర్ ఊరుకోరని తెలిపారు. మోతె మట్టినా కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా చల్లి ఉద్యమ స్ఫూర్తి రగిలించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా మోతెలో పీఏసీఎస్‌ను ఏర్పాటు చేయించినట్టు చెప్పారు. గ్రామం చుట్టూ ఉన్న రెండు వాగుల్లో చెక్ డ్యాంలు నిర్మించి ద్వీపంలా తీర్చిదిద్దినట్టు తెలిపారు. చెరువుకు మాటుకాలువ నిర్మించి శాశ్వతంగా నీటి సమస్య పరిష్కరించినట్టు చెప్పారు. కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

మోతె గ్రామంలో మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

కేటీఆర్‌కు ఎన్నికల సంఘం నోటీసు

నేడు మధ్యాహ్నం వరకు సమాధానమివ్వాలని ఆదేశం

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌కు ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో ప్రభుత్వ భవనమైన టీ వర్క్స్‌లో సమావేశాలు నిర్వహించడం నిబంధనలను ఉల్లంఘించడమేనని నోటీసులో కేంద్ర ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాశ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల్లోగా సమాధానం ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరిపి నోటీసు జారీ చేశారు. ఎన్నికల ప్రచారంలో ఎన్నికల సంఘం నియమ నిబంధనలు పాటించాలని సీఎం కేసీఆర్‌కు సూచించింది. సభలు, సమావేశాల్లో మాట్లాడే సమయంలో ఎన్నికల నిబంధనలు పాటించాలని అవినాశ్‌కుమార్ కేసీఆర్‌కు సూచించారు.